క్లుప్తంగా

సహకార సంఘాలకు పర్సన్ ఇన్‌చార్జిల నియామకం


కె.జె.పురం పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి, ఇతర డైరెక్టర్లను అభినందిస్తున్న సీఈవో, తదితరులు

మాడుగుల రూరల్: మండలంలో సహకార సంఘాలకు త్రిసభ్య కమిటీలు ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. కె.జె.పురం సహకార సంఘానికి పర్సన్ ఇన్‌చార్జిగా శరగడం ఆదిబాబు, డైరెక్టర్లుగా శ్రీనాథు శేఖర్, లెక్కల శ్రీనివాసరావును నియమించారు. నియామకపు పత్రంను సంఘ సీఈవో కాళ్ల ఈశ్వరరావు చేతుల మీదుగా ఆదిబాబు అందుకున్నారు. మాడుగుల సహకార సంఘానికి పర్సన్ ఇన్‌చార్జిగా కోట్నాల త్రినాథ్, డైరెక్టర్లుగా కర్రి లక్ష్మీరావు, మాటూరి మంగమ్మా, ఎం.కోడూరు సహకార సంఘ పర్సన్ ఇన్‌చార్జిగా పడాల చాణిక్య, డైరెక్టర్లుగా కె.బాలరాజు, పి.సత్యనారాయణను నియమిస్తూ సహకార శాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

వైఎస్సార్‌సీపీ శ్రేణులు తరలిరావాలి


మండల పార్టీ అధ్యక్షులు కొరుప్రోలు పాణీ శాంతారామ్

గొలుగొండ: నర్సీపట్నంలో శుక్రవారం ఉదయం 9 గంటలకు మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ ఆధ్వర్యంలో జరగనున్న వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశానికి పార్టీ శ్రేణులు తరలిరావాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు కొరుప్రోలు పాణీ శాంతారామ్ కోరారు. మండలం నుంచి ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పార్టీ అనుబంధ కమిటీల సభ్యులు తప్పకుండా హాజరు కావాలన్నారు.

మురుగునీటి సమస్యకు పరిష్కారం


కాలువలో మురుగున తొలగించే పనుల్లో పారిశుధ్య సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

కె.కోటపాడు : ఎ.కోడూరులో యాతపేటలో ఇటీవల నిర్మించిన కాలువలో నిలిచిన మురుగును తొలగించే పనులను పంచాయతీ కార్యదర్శి కె.గోపి దగ్గరుండి చేపట్టారు. గురువారం సాక్షి దినపత్రికలో ఎ.కోడూరులో యాతపేటలో మురుగునీటి నిల్వలతో ఇబ్బందులు శీర్షికన ప్రచురితమైన కథనానికి పంచాయతీ కార్యదర్శి స్పందించారు. కాలువల్లో ఉన్న నిల్వ మురుగునీటిని తొలగించే చర్యలను పారిశుధ్య సిబ్బందితో చేపట్టారు. పరిసరాల్లో బ్లీచింగ్‌ను చల్లించారు.

అందుబాటులో విత్తనాలు


పశుగ్రాసం ఉపయోగాలను వివరిస్తున్న పశువైద్యాధికారి నాయుడు

కె.కోటపాడు : గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో పశుసంవర్ధక శాఖ ద్వారా రాయితీపై గడ్డి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని చౌడువాడ పశువైద్యాధికారి సిహెచ్.వై.నాయుడు తెలిపారు. పశుగ్రాస వారోత్సవాలలో భాగంగా గురువారం పడి రైతులకు పశుగ్రాసం వల్ల పశువులకు కలిగే మేలును ఆయన వివరించారు. ఆరు లీటర్లు పాలు ఇచ్చే పశువులకు దాణా ఖర్చు లేకుండా పచ్చగడ్డిని అందించి పోషించవచ్చునని చెప్పారు. కాకి, మొక్కజొన్న రకం గడ్డి విత్తనాలను 75 శాతం రాయితీపై అందిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది కనకారావు, పాల్గొన్నారు.

వ్యవసాయ యాంత్రీకరణ మేళా ఏర్పాట్ల పరిశీలన


మేళా ఏర్పాట్లను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మోహన్‌రావు

నర్సీపట్నం: పెదబొడ్డేపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులో శుక్రవారం జరగనున్న వ్యవసాయ యాంత్రీకరణ మేళా ఏర్పాట్లను మార్కెట్ కమిటీ చైర్మన్ గవిరెడ్డి వెంకటరమణతో కలిసి జిల్లా వ్యవసాయశాఖ అధికారి మోహన్‌రావు పరిశీలించారు. వ్యవసాయ యంత్రాల ఆవశ్యకతను రైతుల్లోకి తీసుకువెళ్లేందుకు ఈ మేళా నిర్వహిస్తున్నామని మోహన్‌రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ టి.శ్రీదేవి, ఏవో విజయలక్ష్మి పాల్గొన్నారు.

ఆలయాలకు గురుపౌర్ణమి శోభ


పాకలపాడులో బాబాను దర్శించుకుంటున్న భక్తులు


కొండపాలెం సాయి మందిరంలో పూజలు చేస్తున్న భక్తులు

- భక్తులతో కిటకిటలాడిన సాయిబాబా మందిరాలు
- మార్మోగిన సాయి నామస్మరణ

చోడవరం: పవిత్ర గురుపౌర్ణమి వేడుకలు గురువారం భక్తిశ్రద్ధలతో జరిగాయి. సాయిబాబా మందిరాలతో పాటు చోడవరం స్వయంభూ విఘ్నేశ్వరాలయం, స్వయంభూ గౌరీశ్వరస్వామి, వేంకటేశ్వరస్వామి, కేశవస్వామి ఆలయాల్లో గురుపౌర్ణమి పూజలు చేశారు. సాయిబాబాకు ఇష్టమైన గురువారం గురుపౌర్ణమి రావడంతో షిర్డీ సాయిబాబా మందిరాలకు భక్తులు పోటెత్తారు. వెంకన్నపాలెం షిర్డీ సాయిబాబా ఆలయంలో గోవాడ సుగర్ ఫ్యాక్టరీ యాజమాన్యం ఆధ్వర్యంలో వేడుకలు కనుల పండువగా జరిగాయి. ఉదయం నుంచి స్వామివారికి పాలు, తేనె, నీటితో అభిషేకాలు చేశారు. బంగారం, వెండి ఆభరణాలు, పూలదండలతో స్వామివారిని సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఈ కార్యక్రమంలో ఫ్యాక్టరీ మేనేజింగ్ డైరెక్టర్ వెంకటేశ్వరరావు, గుర్తింపు కార్మిక సంఘం అధ్యక్షుడు కేవీవీ భాస్కరరావు, యూనియన్ నాయకుడు శరగడం రామునాయుడు పాల్గొన్నారు. సాయంత్రం బాబా తిరువీధోత్సవం నిర్వహించారు. చోడవరం షిర్డీసాయిబాబా ఆలయంలో స్వామివారికి లక్షపత్రి పూజ వైభవంగా చేశారు. ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీపై సాయిబాబా ఉత్సవమూర్తిని స్థానిక పురవీధుల్లో కొత్తూరు, మెయిన్‌రోడ్డు, కో–ఆపరేటివ్ కాలనీ మీదుగా పట్టణంలో తిరువీధోత్సవం నిర్వహించారు.

నర్సీపట్నం: బలిఘట్టం పాకలపాడు గురువుగారు ఆశ్రమంలో గురుపౌర్ణమి పూజలు ఘనంగా జరిగాయి. నర్సీపట్నం పరిసర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. వేల మంది భక్తులు రావడంతో గురువుగారు ఆశ్రమంలో సందడి వాతావరణం నెలకొంది. పూజలు అనంతరం భక్తులు గురువుగారిని దర్శించుకున్నారు. అన్నసంతర్పణలో పాల్గొన్న భక్తులు ప్రసాదాన్ని స్వీకరించారు. షిర్డీ సాయి మందిరంలో గురుపౌర్ణమి పూజలను ఘనంగా నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. స్పీకర్ సతీమణి, కౌన్సిలర్ సిహెచ్.పద్మావతి ప్రత్యేక పూజలు చేశారు.


కొత్తకోటలో నగర సంకీర్తన చేస్తున్న భక్తులు


మాకవరపాలెంలో బాబాను దర్శించుకుంటున్న భక్తులు

రోలుగుంట: కొండపాలెంలోని సాయిమందిరానికి భక్తులు ఉదయం నుంచి సాయంత్రం వరకూ అధిక సంఖ్యలో వచ్చి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. కమిటీ సభ్యులు మధ్యాహ్నం అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. స్థానికులతో పాటు రోలుగుంట, వెలంకాయలపాలెం, కొత్తకాలనీ నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి ప్రసాదం స్వీకరించారు.

రావికమతం: కొత్తకోటలో షిర్డీసాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నవకలశ స్నపనం, పంచామృత అభిషేకాలు జరిపారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, భక్తులు నగర సంకీర్తన నిర్వహించారు. మధ్యాహ్నం అన్నసమారాధన కార్యక్రమంలో భక్తులు పాల్గొని బాబా ప్రసాదం స్వీకరించారు.

కె.కోటపాడు : కె.కోటపాడులోని షిర్డీసాయినాథునికి ఆలయ కమిటీ సభ్యులు లక్ష యాలక పళ్లతో ప్రత్యేక అర్చన నిర్వహించారు. ఆలయ అర్చకుడు గోరుగుంతు రమేష్‌బాబు వేద మంత్రాల నడుమ జరిగిన ఈ అర్చనలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పాతవలస గ్రామంలోని షిర్డీసాయిబాబా ఆలయంలో పెద్ద సంఖ్యలో భక్తులు పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్లి మాజీ సర్పంచ్ బోశెం కృష్ణారావు, దుర్గ పాల్గొన్నారు. కె.కోటపాడు ఆలయం వద్ద మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేశారు.


చోడవరం సాయిబాబా ఆలయంలో లక్షపత్రి పూజ చేస్తున్న అర్చకులు


రైవాడలో షిర్డీ సాయిబాబాను దర్శించుకుంటున్న భక్తులు


కె.కోటపాడులో షిర్డీసాయికి లక్ష యాలక పండ్లతో నిర్వహిస్తున్న ప్రత్యేక అర్చన

ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు వేగి రామారావు, జె.రామపాపారావు, ధర్మారావు, గడ్డిబాబు, యాళ్ళ సాయి, రమణమ్మ పాల్గొన్నారు.

మాడుగుల రూరల్: గురు పౌర్ణమి సందర్భంగా కె.జె.పురం జంక్షన్‌లోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఉన్న షిర్డీ సాయినాథునికి గురువారం ఉదయం నుంచి పూజలు, నవకలశ స్నపనం, పంచామృత అభిషేకాలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఉపాధ్యక్షుడు కాళ్ల అప్పలనాయుడు, కోశాధికారి పుట్టా బలరామూర్తి, ఆలయ కమిటీ సభ్యులు పుట్టా రాంబాబు, శ్రీవారి సేవకులు పాల్గొన్నారు.

దేవరాపల్లి: మండలంలోని రైవాడ షిర్డీ సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది. సాయి నామ స్మరణంతో బాబా ఆలయం మార్మోగింది. అనంతరం మధ్యాహ్నం ఆలయ ఆవరణలో నిర్వహించిన భారీ అన్నసమారాధనకు మండల వ్యాప్తంగా భక్తజనం తరలివచ్చి బాబా ప్రసాదాన్ని స్వీకరించారు. సాయంత్రం ఆలయం వద్ద భజన కార్యక్రమం నిర్వహించారు.

మాకవరపాలెం: మండలంలోని గిడుతూరు, మాకవరపాలెం, తామరం, బయ్యవరం గ్రామాల్లోని సాయిబాబా ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. భక్తుల సాయి నామస్మరణతో ఆలయాలు మార్మోగాయి. పూజల అనంతరం ఆలయ కమిటీల ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

గొలుగొండ: మండలంలో జోగుంపేట, ఏఎల్ పురం ప్రాంతంలో ఉన్న సాయిబాబు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. సాయిబాబా దర్శనం కోసం భక్తులు బారులు తీరారు. జోగుంపేటలో గాదె రాము ఆధ్వర్యంలో 2 వేల మంది భక్తులకు అన్నసమారాధన ఏర్పాటు చేశారు.

75 శాతం రాయితీపై పశుగ్రాస విత్తనాలు


క్షేత్రస్థాయిలో పశుగ్రాసాల సాగుపై అవగాహన కల్పిస్తున్న ఏడి డాక్టర్ రాంబాబు

నర్సీపట్నం: పాడి పశువుల్లో పాల దిగుబడితో పాటు పునరుత్పత్తి సామర్థ్యం పెంపు కోసం పశుగ్రాస విత్తనాల పంపిణీకి శ్రీకారం చుట్టామని నర్సీపట్నం ఏరియా వెటర్నరీ హాస్పిటల్ ఏడీ డాక్టర్ డబ్ల్యూ.రాంబాబు తెలిపారు. అమలాపురం గ్రామంలో గురువారం పశుగ్రాసాల పెంపకంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 75 శాతం రాయితీపై పశుగ్రాస విత్తనాలు పంపిణీ చేస్తున్నామన్నారు. పశుగ్రాసాల వల్ల పశువులకు అన్ని రకాలైన పోషకాలు అందుతాయన్నారు. వేములపూడి పశువైద్యాధికారి డాక్టర్ నరేష్ మాట్లాడుతూ ఎండు గడ్డిలో పోషక విలువలను ఏ విధంగా పెంచాలో హే మేకింగ్‌ను ప్రయోగాత్మకంగా చేసి చూపించారు.

వైభవంగా మరిడిమాంబ పండగ


మరిడిమాంబకు పూజలు చేస్తున్న భక్తులు

మాడుగుల రూరల్: ఎం.కోడూరులో మరిడిమాంబ పండగ గురువారం వైభవంగా జరిగింది. తెల్లవారుజాము నుంచి అమ్మవారిని చుట్టు పక్కల గ్రామాలకు చెందిన భక్తులు తరలివచ్చి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గొల్లవిల్లి సంజీవిరావు, ఎంపీటీసీ సభ్యులు ముమ్మిన రమణబాబు, ఉప సర్పంచ్ గెంజి రాజేశ్‌కుమార్, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు పడాల అప్పలనాయుడు, పుప్పాల లక్ష్మీనారాయణ, ఎ.భాస్కరరావు, విశ్వనాథం, లింగన్న పాల్గొన్నారు. భక్తులకు మజ్జిగ, ప్రసాదం పంపిణీ చేశారు.

రావికమతం: మండలంలో కొత్తకోట గ్రామ ఆరాధ్య దైవం మరిడిమాంబ అమ్మవారి పండగ గురువారం ఘనంగా జరిగింది. అమ్మవారి శతకం పట్టు వద్ద భీమరాతి ఇంటి నుంచి గరగా తీసి ఉత్సవాలు ప్రారంభించారు. అమ్మవారిని తెల్లవారు జామున నుంచి భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారికి ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం థింసా నృత్యం, నేల డ్యాన్స్‌లు, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

విద్యార్థులకు పుస్తకాలు, పెన్నుల పంపిణీ


విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు అందిస్తున్న శ్రీనివాసరావు

కె.కోటపాడు : చౌడువాడ గ్రామ మాజీ సర్పంచ్ రాజి అప్పారావు తృతీయ వర్ధంతి సందర్భంగా గురువారం ఆయన కుమారుడు, గోవాడ సుగర్ ఫ్యాక్టరీ మాజీ డైరెక్టర్ శ్రీనివాసరావు స్థానిక హైస్కూల్ విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు, తదితర సామగ్రి పంపిణీ చేశారు. 9, 10 తరగతులు చదువుతున్న 203 మందికి వీటిని అందజేశారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు ఈర్లి అప్పారావు, సర్పంచ్ దాడి ఎరుకునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ పురోగతి సూచికపై శిక్షణ


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీపీ పైల రాజు

రావికమతం: మండల పరిషత్ ఆవరణలోని వెలుగు కార్యాలయంలో గురువారం పంచాయతీ పురోగతి సూచిక వెర్షన్ 2.0పై మండల స్థాయి శిక్షణ జరిగింది. మండల స్థాయి అధికారులు, గ్రేడ్–1 నుంచి గ్రేడ్–5 వరకు పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్, డిజిటల్ అసిస్టెంట్స్, ఏఎన్ఎంలకు ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ శిక్షణ ఇచ్చారు. పంచాయతీరాజ్ అచీవ్‌మెంట్స్ ఇండెక్స్‌పై ఎంపీడీవో వెంకన్నబాబు అవగాహన కల్పించారు. ఎంపీపీ పైల రాజు, మండల ప్రత్యేక అధికారి వసంతరావు, డిప్యూటీ ఎంపీడీవో సీతారామస్వామి, పాల్గొన్నారు.

నిబంధనల మేరకు పనులు చేస్తేనే అవార్డులకు ఎంపిక


అవగాహన కల్పిస్తున్న కోఆర్డినేటరు రమేష్

నాతవరం: నిబంధనలు అనుసరించి అభివృద్ధి పనులు చేసే పంచాయతీలకు జాతీయ రాష్ట్ర స్థాయిలో అవార్డుల కోసం ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నామని కోఆర్డినేటరు బత్తుల రమేష్ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో గరువారం పంచాయతీలో పని చేసే అన్నిశాఖల అధికారులకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కొత్తగా వచ్చిన నిబంధనలు ప్రకారం అన్ని శాఖల అధికారులు సమన్వయంతో సకాలంలో అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలు అందించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. గతంలో అవార్డుల ఎంపిక విషయంలో పలు లోపాలు జరిగేవని, వాటిని నివారించేందుకు శిక్షణ కార్యక్రమం ద్వారా అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఏవిధంగా పనులు చేపట్టాలన్న అంశాలు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్ ఎం.ప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు సంఘం మండల శాఖ అధ్యక్షుడు లాలం శేషు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

న్యాయవాద సంఘం కార్యవర్గం ఎన్నిక


నూతన కార్యవర్గం

నర్సీపట్నం: న్యాయవాద సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గురువారం కోర్టు సముదాయంలో ఎన్నికల అధికారి పొక్కునూరి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఈ ఎన్నిక నిర్వహించారు. మెజార్టీ సభ్యులు గత పాలక వర్గాన్నే కొనసాగించడానికి ఆమోదం తెలపడంతో అన్ని పదవులు ఏకగ్రీవమైనట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు. అధ్యక్షుడిగా మెట్టా ప్రభాకర్, కార్యదర్శిగా అనిమిరెడ్డి శివకృష్ణ, ఉపాధ్యక్షుడిగా కోసూరి అప్పలనాయుడు, సంయుక్త కార్యదర్శిగా వాసవి దత్తా, కోశాధికారిగా కె.వి.రమణ, లైబ్రేరియన్‌గా యం.గోవర్ధన గిరి ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు పొక్కునూరి నరసింహులు, గొలుసు శంకర్, రావాడ సత్యనారాయణ, కె.ఆర్.వి.సత్యనారాయణ, బుల్లి దొర, ఎస్.కె.నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు బానిస కావద్దు


ఏఎల్‌పురంలో మాట్లాడుతున్న ఎస్‌ఐ తారకేశ్వర్రావు

గొలుగొండ: విద్యార్థులు చిన్నతనం నుంచి చదువుపై దృష్టి సారించి మంచి భవిష్యత్‌ను ఎంచుకోవాలని కృష్ణదేవిపేట, గొలుగొండ ఎస్‌ఐలు తారకేశ్వర్రావు, రామారావు తెలిపారు. ఏఎల్‌పురం, పాతమల్లంపేట గ్రామాల్లో నిర్వహించిన తల్లిదండ్రులు సమావేశం అనంతరం ఎస్‌ఐల మాట్లాడుతూ డ్రగ్స్ వద్దు అనే కార్యక్రమంపై విద్యార్థులతో ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు డ్రగ్స్‌తో పాటు ఇతర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో–1 సత్యనారాయణ, ఎంఈవో–2 ఏపీఎస్ఎస్ మూర్తి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యుత్ వినియోగదారులకు ఉత్తమ సేవలందించాలి


మాట్లాడుతున్న ఏపీఈపీడీసీఎల్ చీఫ్ జనరల్ మేనేజర్ విజయ లలిత

రోలుగుంట: విద్యుత్ వినియోగదారుల నుంచి ఏ విధమైన ఫిర్యాదులు రాకుండా సిబ్బంది ఉత్తమ సేవలు అందించాలని ఏపీఈపీడీసీఎల్ చీఫ్ జనరల్ మేనేజర్ విజయ లలిత ఆదేశించారు. స్థానిక 33/11 కేవీ, విద్యుత్ పవర్ స్టేషన్ వద్ద గురువారం జిల్లా ఎస్‌ఈ జి.ప్రసాద్ ఆధ్వర్యంలో నర్సీపట్నం డివిజన్ డీఈ అప్పారావు, మండల స్థాయిలో ఏఈ, జేఎల్ఎం, లైన్‌మెన్, సహాయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గృహ, వ్యవసాయ మోటార్ల వినియోగదారుల నుంచి వస్తున్న శాఖాపరమైన ఫిర్యాదులను పరిశీలించి వెంటనే స్పందించాలన్నారు. సిబ్బంది పని చేస్తున్న గ్రామాల్లోనే నివాసం ఉండి సేవలందించాలన్నారు. మండలంలో గ్రామాల వారీగా అధికంగా ఎటువంటి ఫిర్యాదులు వస్తున్నాయో సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. లోవోల్టేజీ సమస్యపై ఆరా తీశారు. ఫిర్యాదులు పరిష్కరించకుండా పరిష్కరించినట్టు సంతకాలు చేస్తే సహించేది లేదన్నారు. రావికమతం, రోలుగుంట మండలాల్లో తన దృష్టికి వచ్చిన ఫిర్యాదుల గురించి సిబ్బందిని ప్రశ్నించారు. వినియోగదారుల నుంచి వస్తున్న ఫిర్యాదుల పరిష్కారంలో చొరవ తీసుకోవాలని డీఈ అప్పారావుకు సూచించారు.

అట్టహాసంగా మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశాలు


మాకవరపాలెం కేజీబీవీలో తల్లుల నుంచి ఆశీర్వాదం పొందుతున్న విద్యార్థులు


డి.సురవరంలో విద్యార్థులకు మొక్కలు పంపిణీ చేస్తున్న హెచ్ఎం చంద్రరావు, గ్రామ పెద్దలు


గాదిరాయి జెడ్పీ హెచ్ పాఠశాలలో తల్లిదండ్రులకు బహుమతులు అందిస్తున్న ఎంపీపీ రాజారామ్


దేవరాపల్లి హైస్కూల్‌లో తల్లులకు పాద పూజ చేస్తున్న విద్యార్థులు

నర్సీపట్నం: మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశాలు గురువారం అట్టహాసంగా జరిగాయి. మండలంలో యరకన్నపాలెం ఎంపీయూపీ స్కూల్‌లో జరిగిన సమావేశంలో ఎంపీపీ సుర్ల రాజేశ్వరి, నర్సీపట్నం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన పేరెంట్స్ సమావేశానికి మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, బాలికల ఉన్నత పాఠశాలలో జరిగిన సమావేశానికి కౌన్సిలర్ సిహెచ్.పద్మావతి హాజరయ్యారు. తల్లిదండ్రులకు ముగ్గులు, క్రీడా పోటీలు నిర్వహించారు. అనంతరం మొక్కలు పంపిణీ చేశారు. సర్పంచ్ నారాయణమ్మ, నియోజకవర్గ బూత్ కమిటీల విభాగం అధ్యక్షుడు సుర్ల చంద్రశేఖర్, కాలేజీ ప్రిన్సిపాల్ పద్మావతి, కౌన్సిలర్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

మాడుగుల రూరల్: మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశాలు మండలంలో అన్ని ప్రాథమిక, యూపీ, హైస్కూలు, గిరిజన బాలికలు, బాలుర, పాఠశాలల్లో నిర్వహించారు. కె.జె.పురం హైస్కూలులో హెచ్ఎం ఓరుగంటి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో స్కూలు కమిటీ చైర్మన్ కర్రి సంతోష్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పదో తరగతిలో ఉత్తీర్ణత శాతం పెరిగేలా కృషి చేయాలని తల్లిదండ్రులు కోరారు. సర్పంచ్ జామి రమణబాబు, గ్రామ పెద్దలు, నాయకులు పాల్గొన్నారు. దొర్ల సురవరం బేసిక్ ప్రాథమిక పాఠశాలలో హెచ్ఎం పి.చంద్రరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో సర్పంచ్ జయమ్మా, ఎంపీటీసీ సభ్యురాలు సూర్యకాంతం, గ్రామ పెద్దలు చేతుల మీదుగా విద్యార్థులకు మొక్కలు పంపిణీ చేశారు.

మాడుగుల: మండలంలో గాదిరాయి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో తల్లిదండ్రులకు పోటీలు నిర్వహించారు. విజేతలకు ఎంపీపీ తాళ్ళపురెడ్డి వెంకటరాజారామ్, సర్పంచ్ పెంటకోట జగన్నాథరావు హెచ్ఎం కె.నాగేశ్వరరావు బహుమతులు అందజేశారు. మాడుగుల జెడ్పీ బాలుర హైస్కూల్‌లో ఈ ఏడాది 10వ తరగతిలో ప్రథమ శ్రేణిలో నిలిచిన విద్యార్థికి రూ.5వేలు, ద్వితీయ శ్రేణిలో నిలిచిన విద్యార్థికి రూ.2500 నగదు ప్రోత్సాహకాలను ఎంఈవో దేముడమ్మ అందజేశారు. తాటిపర్తి ట్రైబుల్ వెల్ఫేర్ బాలికల హైస్కూల్‌లో ఎంపీడీవో కొంకి అప్పారావు, జంపెన ప్రాథమిక పాఠశాలలో సర్పంచ్ గురువునాయుడు, మానస సంఘం అధినేత పరమేశ్వరరావు ఆధ్వర్యంలో మొక్కలు నాటారు.

దేవరాపల్లి: దేవరాపల్లిలోని ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాలలో జరిగిన మెగా పీటీఎంలో ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మీ మాట్లాడుతూ క్రమ శిక్షణతో కూడిన విద్యను అందించాలన్నారు. దేవరాపల్లి హైస్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో ఎస్‌ఐ టి.మల్లేశ్వరరావు, వైస్ ఎంపీపీ ఉగ్రాకుల గంగాభవానీ, సర్పంచ్ సబ్బవరపు పెంటమ్మ, ఎంపీటీసీ మొల్లి కృష్ణమూర్తి తదితరులు పాల్గొని విద్యార్థులకు పలు సలహాలు, సూచనలు చేశారు. ఈ సందర్భంగా దేవరాపల్లి హైస్కూల్ హెచ్ఎం, ఇన్‌చార్జ్ ఎంఈవో–1 సిహెచ్.ఉమ సమక్షంలో విద్యార్థులు తమ తల్లులకు పాదపూజ చేశారు. బేతపూడి కేజీబీవీ, తెనుగుపూడి గురుకుల పాఠశాలలో తల్లిదండ్రులకు క్రీడా పోటీలు నిర్వహించారు.

కె.కోటపాడు : పిండ్రంగిలోని పాఠశాలలో నిర్వహించిన మెగా పీటీఎంలో ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి హాజరై పలు సూచనలు చేశారు. విద్యార్థుల ప్రగతిని తల్లిదండ్రులకు ఉపాధ్యాయులు వివరించారు. ఈ కార్యక్రమంలో డ్వామా పీడీ ఆర్.పూర్ణిమాదేవి, ఎంపీడీవో సాంబశివరావు, ఎంఈవోలు సత్యనారాయణ, డీవీడీ ప్రసాద్ పాల్గొన్నారు. గుల్లేపల్లి పాఠశాలలో హెచ్ఎం ఎస్.వీరాంజనేయులు ఆధ్వర్యంలో జరిగిన పీటీఎంలో సర్పంచ్ బండారు దేముళ్ళు, ఎంపీటీసీ దేముడుబాబు పాల్గొన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మెగా పీటీఎం జరిగింది. ప్రిన్సిపాల్ ఎస్.నాగమణి, అధ్యాపకులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మాకవరపాలెం: విద్యార్థులు సెల్ ఫోన్లకు దూరంగా ఉండాలని ఎంపీపీ రుత్తల సర్వేశ్వరరావు, మండల ప్రత్యేక అధికారి రామ్మోహన్‌రావు సూచించారు. ఎంపీడీవో చాయాసుధ, తహ సీల్దార్ వెంకటరమణ, ఎంఈవో మూర్తి, వైస్ ఎంపీపీలు రుత్తల లక్ష్మి, రాజారావు, డీటీ నూకరాజు, వైద్యాధికారి శ్రీనివాసరావు, ఎస్ఎంసీ చైర్మన్లు పాల్గొన్నారు. మాకవరపాలెం కేజీబీవీలో తల్లులకు విద్యార్థులు పాద పూజ చేశారు.

చోడవరం: మండలంలో అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాల్లో విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించారు. చోడవరం జెడ్పీ గర్ల్స్ హైస్కూల్‌లో జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే రాజు పాల్గొని ట్రిపుల్ ఐటీకి ఎంపికైన 11 మంది విద్యార్థినులను, ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌కు ఎంపికైన విద్యార్థులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం రామిరెడ్డి, జెడ్పీటీసీ మారిశెట్టి విజయశ్రీకాంత్, ఎంపీపీ గాడి కాసు, సర్పంచ్ బండి నూకాలమ్మ, పాల్గొన్నారు.

రావికమతం: మండల కేంద్రం రావికమతం, కొత్తకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన పీటీఎంలో ఎమ్మెల్యే రాజు పాల్గొని సూచనలు చేశారు.

చీడికాడ: మంచాల మోడల్ స్కూల్‌లో జరిగిన మెగా పీటీఎంలో భాగంగా ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో మాట్లాడారు. అనంతరం ఉపాధ్యాయులను దుశ్శాలువాలతో సత్కరించారు. ఎంపీడీవో హేమసుందరరావు, తదితరులు పాల్గొన్నారు.

రోలుగుంట: గురువులు, తల్లిదండ్రులను గౌరవిస్తాం .. బుద్ధిగా చదువుకుంటాం.. క్రమం తప్పకుండా పాఠశాలకు వస్తాం, క్రమశిక్షణతో మెలుగుతాం అంటూ చోడవరం ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు ఉపాధ్యాయులతో కలసి విద్యార్థులతో స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రతిజ్ఞ చేయించారు.

ప్రకాశవంతంగా పౌర్ణమి చంద్రుడు


కె.జె.పురం విద్యుత్ ఉపకేంద్రం సమీపంలో మెరిసిన చంద్రుడు

మాడుగుల రూరల్ : ఆషాఢ గురు పౌర్ణమి రోజున చంద్రుడు ప్రకాశవంతంగా మెరిసిపోయాడు. గురువారం సాయంత్రం కె.జె.పురం విద్యుత్ ఉపకేంద్రం సమీపంలో తూర్పు దిక్కున చంద్రుడు వెలిగిపోతూ ఆకట్టుకున్నాడు.